

10న కురుపాంలో జాబ్‌మేళా

కురుపాం,ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 10న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు, 18 నుంచి 28 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు ఈ 63034 93720, 89788 78557 నెంబర్లకు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

కనుల పండువగా..

- సీతారాముల కల్యాణోత్సవం
- శ్రీరామ నామస్మరణతో మార్మోగిన తోటపల్లి
- భారీగా భక్తుల హాజరు
- వాడవాడలా నవమి వేడుకలు
- వెల్లివిరిసిన ఆధ్యాతిక శోభ



తోటపల్లి కోదండరామస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వాడవాడలా శ్రీరామ నామ స్మరణ మార్మోగింది. మేళతాళాలు.. వేదమంత్రోచ్చారణల నడుమ సీతారాముల కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంక టేశ్వరస్వామి, కోదండరామస్వామి దేవస్థానాల పరిధిలో ఆదివారం నవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వ హించారు. తొలుత సుప్రభాత సేవ, ఆరాధన, మంగళా శాసనం, విశ్వక్సేన పూజ, పుణ్యహ వాచనం, రుత్విక్ వరుణ, రక్షా బంధనం, మృత్యుం గ్రహణం, అంకురారోపణంతో పాటు పలు పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు, మురపాక రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఎవరికీ అసౌకర్యం కలగకుండా ఈవో వీవీ సూర్యనారాయణ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. దర్శనం అనంతరం భక్తులకు పానకంతో ప్రసాదాలను అందించారు. తోటపల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు.



సాలూరులో పూజలందుకున్న ఉత్సవ విగ్రహాలు

రామతీర్థంలో...

నెల్లిమర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. దేవస్థానం వెనుకవైపు ఉన్న వేదికపై వేలాది మంది భక్తుల సమక్షంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిగింది. ప్రభుత్వం తరఫున మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఆయన కుమార్తె, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మధుపర్కాలు సమర్పించారు. సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం నుంచి ఈవో సుబ్బారావు తీసుకొచ్చిన పట్టు వస్త్రాలను మంత్రి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దంపతుల చేతుల మీదుగా అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామతీర్థం దేవస్థానం ఈవో వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో స్వామివారి కల్యాణాన్ని అర్చకులు ఖండవిల్లి సాయిరామాచార్యులు, కిరణ్‌కుమార్, పవన్‌కుమార్, గొడవర్తి నరసింహాచార్యులు తదితర అర్చక బృందం శాస్త్రోకంగా నిర్వహించింది. రామనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. సుమారు 30 వేల మంది భక్తులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ప్రముఖులు రాములోరి కల్యాణోత్సవాన్ని తిలకించారు.



రామతీర్థం దేవస్థానంలో..



మంత్రి సంధ్యారాణికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

తాగునీటి సమస్యలు తలెత్తరాదు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీరింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. సమస్య ఉన్న చోట తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పక్కాగా నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో చేపట్టే 14 రకాల టెస్ట్‌లను రోజూ పర్యవేక్షిం చాలని ఆదేశించారు. వేసవిలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ యూనిట్ల ఏర్పాటు వేగవంతం

జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాల మేరకు మండల అధికారులు పని చేయాలన్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో ఇంటర్వ్యూలు పూర్తి చేసినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రకియ పూర్తి చేసి బ్యాంకుల సమన్వ యంతో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఆ వివరాలను బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లాగిన్‌కు వెంటనే పంపించాలన్నారు. జిల్లాలో 1221 యూనిట్లను రూ.23.24 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

ఆయుష్మాన్‌భవ!

- సరైన జీవనశైలితోనే ఆరోగ్యం
- వ్యాయామం తప్పనిసరి
- ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు అవసరం
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 6: ప్రస్తుతం మారుతున్న జీవన విధానం, మత్తుపదార్థాల వినియోగం, పని ఒత్తిడి, నిద్రలేమి కారణాలతో రోగాలు చుట్టుముడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా మెడ, నడుము, మోకాళ్లు, డయాబెటిక్, థైరాయిడ్, బీపీ, గుండె, కిడ్నీ, కాలేయం, పెరాలసిస్, బ్రెయిన్ స్ట్రోక్, మానసిక సమస్యలతో ఎక్కువమంది ఆస్పత్రు లకు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. జీవనశైలి విధానం వల్లే అధిక శాతం మంది రోగాలు కొని తెచ్చుకుంటున్నారని తెలియజేస్తున్నారు. సరైన ఆహార నియామాలు, తగినంత వ్యాయామం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు లేకుండా ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని సూచి స్తున్నారు. నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఇలా చేస్తే మేలు..



ఆరోగ్యంగా ఉండేందుకు పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవాలి. బాదం, జీడిపప్పు, అవిసె గింజలు, చియా, పొద్దుతిరుగుడు, గుమ్మడి, పుచ్చకాయ, బొప్పాయి, మొక్కజొన్న గింజలను ఆహారంగా తీసుకోవాలి. వీటివల్ల గుండెజబ్బులు, మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చు. పండ్లు, కూరగాయలు శరీర పనితీరును మెరుగుపరిచేందుకు సాయపడతాయి. వాటితో ఆరోగ్యానికి అవసరమైన విటమిన్‌లు ఫైబర్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. బరువును అదుపులో ఉంచుకోవచ్చు. బ్రౌన్ రైస్, కినోవా, ఓట్‌మిల్స్ వంటి తృణధాన్యాల్లో ఫైబర్, ప్రొటీన్, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. శారీరక శ్రమతో బరువును అదుపులో ఉంచుకోవచ్చు. రోజూ వ్యాయామం వల్ల గుండె, ఇతర వ్యవస్థలు బలోపేతం అవుతాయి. శారీరక, మానసిక ఆరోగ్యానికి 8 గంటలు నిద్రపోవడం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.

ఆటంకాలు తొలగేనా?

- జిల్లాలో కానరాని క్రీడాభివృద్ధి
- స్టేడియంల నిర్మాణం కాగితాలకే పరిమితం
- మధ్యలో నిలిచిపోయిన క్రీడా ప్రాంగణాల పనులు
- దృష్టి సారించని గత వైసీపీ సర్కారు
- పూర్తిస్థాయిలో రాణించలేకపోతున్న క్రీడాకారులు
- రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు



పిచ్చిమొక్కల మధ్య గుమ్మలక్ష్మీపురం ఇండోర్ స్టేడియం

పార్వతీపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు కొదవే లేదు. అయితే వారికి అవసరమైన క్రీడా ప్రాంగణాలు, శిక్షణలు 'మన్యం'లో లేవు. దీంతో వారు పూర్తిస్థాయిలో రాణించలేకపోతున్నారు. ప్రధానంగా ఏజెన్సీలో గిరిజన క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారిని ప్రోత్సహించే వారే కరువయ్యారు. వాస్తవంగా జిల్లా ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా.. క్రీడాభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటు, అర్థాంతరంగా నిలిచిన స్టేడియం పనుల పూర్తిగా నిధులు మంజూరు చేయలేదు. దీంతో కొన్నాళ్లుగా క్రీడాకారులకు 'ఆట'ంకాలు తప్పడం లేదు. ప్రస్తుతం వారంతా రాష్ట్ర ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. 'మన్యం'లో క్రీడాభివృద్ధిని పరుగులు పెట్టించాలని వారు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి ...

- ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో సీతంపేట కేంద్రంగా 2018లో క్రీడా వికాస కేంద్రాన్ని ప్రారంభించారు. అది మినహా క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు జిల్లాలో తీసుకున్న చర్యలు పెద్దగా ఏమీ లేవని చెప్పొచ్చు.
- కురుపాం నియోజకవర్గం జియ్యమ్మవలస మండలం ఆర్‌ఆర్‌బీ పురం వద్ద 2005లో తొమ్మిది ఎకరాల 30 సెంట్లు రెవెన్యూశాఖ ద్వారా క్రీడా శాఖకు అప్పగించారు. వాటి పనులు చేపట్టేందుకు అప్పటి ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ సుమారు రూ.22 లక్షలు మంజూరు చేశారు. 400 మీటర్లు అథ్లెటిక్ ట్రాక్ ఫీల్డ్, వాలీబాల్, కబడ్డీ , ఖోఖో తదితర క్రీడలకు వీలుగా ప్రాంగణ ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనలు గాలిలోనే కలిసిపోయాయి. 2006, ఏప్రిల్ 6న పంపిన ప్రతిపాదనలు మేరకు అప్పట్లో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఎంపీ ఫండ్స్ , ఎమ్మెల్యే నిధుల నుంచి రూ. ఏడు లక్షలు, లోకల్ కంట్రీబ్యూషన్‌గా డిపార్ట్‌మెంట్ ద్వారా మరో రూ. ఏడు లక్షలు సమకూర్చుకోవాలని స్టేట్ స్పోర్ట్స్ అథారిటీ అప్పట్లో ఆదేశించింది. కానీ ఆ దిశగా చర్యలు లేకపోవడంతో మంజూరైన రూ.ఐదు లక్షలతోనే చిన్న చిన్న పనులు చేయించి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం ఆ క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా మారడంతో దాని కోసం

(మిగతా 8వ పేజీలో...)



సాలూరులో ఇండోర్ స్టేడియం ఇలా..

పరిశ్రమలు ఏర్పాటయ్యేనా?

- నేడు తొలిసారిగా జిల్లాకు మంత్రి కొండపల్లి రాక
- ఎన్నో ఆశలు పెట్టుకున్న 'మన్యం' వాసులు

8లో

జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం

- చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు
- పాలకొండలో పర్యటన

అదుపు తప్పి ఆటో బోల్తా

- మహిళ మృతి
- తొమ్మిది మందికి గాయాలు
- సీతంపేట మన్యంలో ఘటన



7లో

వైసీపీ క్యాంపు రాజకీయం!

- టీడీపీ అవిశ్వాస తీర్మానం నోటీసుతో ఆ పార్టీలో గుబులు
- పాలకవర్గం చేజారిపోకుండా ఉండేందుకు యత్నం
- కౌన్సిలర్లను కాపాడుకునే పనిలో ఉన్నట్లు ప్రచారం





పార్వతీపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పురపాలక సంఘంలో వైసీపీ కౌన్సిలర్లను కాపాడుకునే పనిలో ఆ పార్టీ నిమగ్నమైంది. ఈ మేరకు కొంతమంది కౌన్సిలర్లతో బెంగుళూరు తదితర ప్రాంతాల్లో ఉన్నట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం మున్సిపాల్టీలో ఆ పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు కనిపించకపోవడంతో క్యాంపు రాజకీయం వాస్తవమేనన్న వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ ఛైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గుణేష్ లపై టీడీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానం ప్రకటించిన నేపథ్యంలో తాజాగా వైసీపీ చర్యలు చర్చనీయాంశమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్వతీపురం నియోజకవర్గంలో వైసీపీ సీన్ మారింది. ఆ పార్టీకి చెందిన కౌన్సిలర్లు వరుసగా టీడీపీలో చేరారు. ఇటీవల మాజీ సీఎం జగన్ పాలకొండకు వచ్చిన సమయంలోనే ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సాధారణ ఎన్నికలకు ముందు వైసీపీ కౌన్సిలర్ బెలగాం కరుణ, ఆమె భర్త జయ ప్రకాష్ నారాయణ తదితరులు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఏడోవార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఎం.పారినాయుడు , ఇటీవల మరికొంతమంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు.
- పార్వతీపురంలో 30 వార్డులకు గాను గతంలో వైసీపీ కౌన్సిలర్లు 22 మంది, ఐదుగురు టీడీపీ , ముగ్గురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు ఉండేవారు. అయితే ఇప్పటి వరకు టీడీపీలోకి సుమారు 13 మంది వైసీపీ కౌన్సిలర్లు చేరారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 18కి చేరింది. ఇండిపెండెంట్ కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడు ఎమ్మెల్యేతో కలిపి టీడీపీ సభ్యుల సంఖ్య 22కు చేరింది. ఈ నేపథ్యంలో పార్వతీపురం పురపాలక సంఘంపై టీడీపీ జెండా ఎగిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.
- టీడీపీకి సంఖ్యా బలం ఉండడంతో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ వైస్ ఛైర్మన్లపై అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు అధికారులకు నోటీసు ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా పురపాలక సంఘంలో రాజకీయ వేడి ప్రారంభమైంది. ఈ క్రమంలో మిగిలిన కౌన్సిలర్లను కాపాడుకోవాలని వైసీపీ వ్యూహ రచన చేసింది. తమ కౌన్సిలర్లను చేజారకుండా పాలకవర్గాన్ని నిలబెట్టుకొనేందుకు ప్రయత్నాలు చేస్తోంది.
- మరో ఏడాదిలో జరగనున్న పురపాలక సంఘం ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించాలని కూటమి పార్టీలు వ్యూహంతో ముందుకెళ్తున్నాయి. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు అనుకూలిస్తే మళ్లీ సిట్టింగ్ కౌన్సిలర్లకే పోటీ చేసే అవకాశం కల్పిస్తామని వైసీపీ వారికి హామీ ఇస్తూ.. క్యాంపు రాజకీయాలు చేపట్టిందనే ప్రచారం జరుగుతోంది.



తలంబ్రాల వేడుక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక



ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ





కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు



టీటీడీ తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు



కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు



రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

నిఘా నీడలో రాములోరి కల్యాణం

● పెణసాంలో 120 మందితో బందోబస్తు ● పర్యవేక్షించిన తహసీల్దారు



రాములోరి కల్యాణోత్సవంలో భక్తులతో పాటు పోలీసులు



గ్రామంలో పోలీసుల బందోబస్తు

గంట్యాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెణసాంలో పోలీసు నిఘా నీడలో ఆదివారం రాములోరికి కల్యాణోత్సవం నిర్వహించారు. నవమి వేడుకల నిర్వహణకు ఇరువర్గాల మధ్య వివాదం నెలకొన్న నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, దాదాపు 120 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మరోవైపు రెవెన్యూ అధికారులు దీన్ని పర్యవేక్షించారు. కల్యాణోత్సవం ప్రశాంతంగా పూర్తవడంతో ఎట్టకేలకు అధికారులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. నవమి సందర్భంగా గ్రామంలోని రామాలయంలో ప్రథమ పూజ నిర్వహణను రెండు రాజకీయ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఆలయాన్ని నిర్మించామని, కొన్ని దశాబ్దాలుగా ప్రథమ పూజ నిర్వహిస్తున్నామని ఒక వర్గం.. అధికారంలోకి వచ్చామని తమకు అవకాశం ఇవ్వాలని మరో వర్గం పట్టుబట్టిన విషయం అందరికి తెలిసిందే. ఈ వివాదం జిల్లా అధికారులు దృష్టికి వెళ్లింది. వారు ఇరువర్గాలతో పలుమార్లు చర్చలు నిర్వహించారు. చివరికి రెండు వర్గాల నుంచి చెరో ఒక్క దంపతుల ప్రథమ పూజకు ఒప్పించడంతో వివాదానికి చెక్ పడింది. దీంతో గ్రామంలోని సీతారాములకు పోలీసులు సమక్షంలో కల్యాణోత్సవాన్ని నిరాడంబరంగా నిర్వహించారు. ఆలయంలో భక్తులతో పాటు పోలీసు సిబ్బంది హాజరై బందోబస్తు నిర్వహించారు. మరోవైపు ఆలయం చుట్టూ, గ్రామంలో పోలీసులు పహరా కాశారు. తహసీల్దార్ నీలకంఠేశ్వరరావు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సాయంత్రం సీతారాములను గ్రామంలోని పోలీసుల సమక్షంలో ఊరేగించారు.

అఖిలకు ఎమ్మెల్యేల పరామర్శ

విజయనగరం రూరల్/ రింగురోడ్డు/ గరివిడి ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దాడికి గురై విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన కోండ్రు అఖిలను ఆదివారం ఉదయం చీపురుపల్లి విజయనగరం ఎమ్మెల్యేలు కిమిడి కళా వెంకటరావు, అదితి గజపతిరాజులు వేర్వేరుగా వెళ్లి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చీపురుపల్లి నియోజకవర్గంలో ఇటువంటి ఘటన జరగడం దురదృష్టకరమని ఎమ్మెల్యే కళా వెంకటరావు అన్నారు.



అఖిలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మెంటాడలో వర్షం



మెంటాడలో కురుస్తున్న వర్షం

మెంటాడ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. కొన్నాళ్లుగా ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న జనాలు ఉపశమనం పొందారు. వర్షాలు లేక ఎండిపోతున్న నువ్వు, రబీ వరి పంటలకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు అంటున్నారు.

అశోక్‌ను కలిసిన ఏఎంసీ చైర్మన్



అశోక్‌తో మాట్లాడుతున్న గోపాలరాజు

గజపతినగరం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పీవీవీ గోపాలరాజు ఆదివారం బంగ్లాలో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను కలిసి తనకు ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రితో కలిసి అశోక్‌ను కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. వీరితో పాటు పార్టీ నాయకులు రామ్‌కుమార్, ప్రదీప్ తదితరులున్నారు.

ఎప్పటిలాగే బెదిరించి..

● ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు

గరివిడి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఎప్పటిలాగే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిద్దామనుకున్నాడు. కానీ కుటుంబ సభ్యులు పట్టించుకోకపోవడంతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు విడిచాడు. వివరాల్లోకి వెళితే గరివిడి పట్టణంలోని కొండపాలెం ప్రాంతానికి చెందిన కవ్వాలి బాలరాజు(32) తాగుడుకు బానిసయ్యాడు. భార్య పద్మ, ఇద్దరు పిల్లలతో పాటు పలాస ప్రాంతంలో పెయింటింగ్ పనులు చేస్తున్న జీవనం సాగిస్తున్నాడు. తరచూ భార్యతో గొడవపడుతూ కొండపాలెంలోని తల్లి యశోద ఇంటికి వచ్చేవాడు. నాలుగురోజుల కిందట కొండపాలెం వచ్చిన బాలరాజు తాగడానికి డబ్బులు ఇవ్వమని తల్లిని అడిగాడు. లేవంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. అప్పటికే తాగి ఉండడంతో అతడిని ఎవరు పెద్దగా పట్టించుకోలేదు. దీంతో బెదిరిద్దామని శనివారం రాత్రి సమీప తోటలోకి వెళ్లి ఉరి వేసుకుందామని ప్రయత్నించే క్రమంలో తాడు బిగుసుకుని నిజంగానే మృత్యువాత పడ్డాడు. గరివిడి పోలీసులు కేసు చేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

గరివిడి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో బి.జె.పాలెం గ్రామానికి చెందిన కె.అప్పన్న (62)ను శనివారం రాత్రి 10 గంటల సమయంలో గుర్తుతెలియని కారు ఢీకొని మృతి చెందాడు. అప్పన్న రాత్రి భోజనం అనంతరం బహిర్భూమికి వెళుతుండగా రాజాం నుంచి చీపురుపల్లి వెళ్తున్న కారు బలంగా ఢీకొనడంతో అప్పన్న మృత్యువాత పడ్డాడు. కుమార్తె సత్తమ్మ ఫిర్యాదు మేరకు గరివిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం పట్టివేత

జామి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఆదివారం వేర్వేరు చోట్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరజనార్దన్ తెలిపారు. మండలంలోని తెలగపాలెం రోంగలి నాగేశ్వరావు 13 మద్యం సీసాలతో, కుమారాం గ్రామానికి చెందిన చిట్టిబోయిన దేముడు 21 మద్యం సీసాలతో పట్టుబడ్డారన్నారు.

20 లక్షల మొక్కల పెంపకానికి చర్యలు

అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియా పాండే

బొండపల్లి, ఏప్రిల్ 6(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 2025-26 సంవత్సరానికి సంబంధించి 20 లక్షల మొక్కలను వనమిత్ర కేంద్రాలతో పాటు నర్సరీల్లో పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అటవీశాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియా పాండే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వనమిత్ర కేంద్రాన్ని ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రకాల మొక్కలతోపాటు ప్రత్యేకంగా ఈ ఏడాది పనస మొక్కలను నర్సరీల్లో పెంచి పంపిణీ చేసేందుకు 30 వేల మొక్కలను రాష్ట్రవ్యాప్తంగా పెంచుతున్నట్టు తెలిపారు. బొబ్బిలి వీణల తయారీ కోసం గాను అవసరం అయిన పనస చెట్ల కొరత తీవ్రంగా ఉన్నట్లుగా ప్రభుత్వం దృష్టికి వీణల తయారీదారులు తీసుకువచ్చిన నేపథ్యంలో వాటి పెంపకానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. వచ్చే ఏడాది 50 వేల పనస మొక్కలను నర్సరీల్లో పెంచి పంపిణీ పెంచేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో కొండలరావు, ఎఫ్ఆర్‌వో సింధూ, ఫారెస్టు ఆఫీసర్ బి.అప్పలరాజు, వనమిత్ర కేంద్రం సహాయకులు పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలసకు చేరిన ఇస్కాన్ భక్తులు

కొత్తవలస, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సంపూర్ణ భారతదేశ పాదయాత్రలో భాగంగా ఇస్కాన్ భక్తులు శనివారం రాత్రి కొత్తవలస చేరుకున్నారు. ఇస్కాన్ అఖిల భారత పాదయాత్ర అధ్యక్షుడు ప్రభూజీ ఆధ్వర్యంలో సనాతన ధర్మం, వైదికసంప్రదాయం విలువలు ధ్యేయంగా పాదయాత్రను నిర్వహిస్తున్నారు. ద్వారకాలో ప్రారంభమైన పాదయాత్ర కేదారినాథ్, బద్రీనాథ్, అయోధ్య, మాయాపూర్, జగన్నాథపురి, శ్రీకూర్మం, సింహాచలం, మంగళగిరి, తిరుపతి, రామేశ్వరం, కన్యాకుమారి చేరుకుని అక్కడ ముగుస్తుందన్నారు. ఎడ్ల బండి రథంపై శ్రీకష్ణ, బలరాముని విగ్రహాలతో పాటు 18 మంది భక్తులు రోజుకు 10 కిలోమీటర్లు వివిధ గ్రామాల మీదుగా పాదయాత్రసాగిస్తున్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు భద్రబలరామదాస్, ఉత్తమ్‌నరహరిదాస్, సునిర్మల చైతన్యదాస్, ద్వారకాదాస్ పాల్గొన్నారు.




ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్నఇస్కాన్ సభ్యులు

ఆహ్వాన క్రికెట్ టోర్నీ ప్రారంభం

గరివిడి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గరివిడిలోని డీఎఫ్ఎన్ కాలనీలో డీఎఫ్ఎన్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రాధిక మెటల్స్ అండ్ మినరల్స్ గ్రూప్ సంస్థల సౌజన్యంతో ఆహ్వాన స్మారక క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలో పలు గ్రామాలకు చెందిన 50 క్రికెట్ జట్లు మూడు వారాల పాటు లీగ్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లలో విజేతలకు ట్రోఫీలు అందజేయనున్నారు. ఇటీవల అకాలంగా మృతిచెందిన చంటి, కరుణ, పుడిరాజుల స్మారక పోటీలను కేసీపీ ట్రోఫీ పేరిట టైటిల్ కప్ ప్రదానం చేయనున్నారు. మైనింగ్ సంస్థ ప్రతినిధి సత్యనారాయణ టాస్ వేసి తొలి మ్యాచ్ ప్రారంభించారు. కార్యక్రమంలో దువ్వాం సర్పంచ్ ప్రతినిధి తోట రవి, ఎంపీటీసీ సభ్యులు నేతేటి కృష్ణవేణి, వి.చిట్టియ్య, జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు

విజయనగరం దాసన్నపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవలస జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన డ్రాయింగ్ ఉపాధ్యాయుడు రేజేటి కరుణాకర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అభినందించారు. రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలు ప్రధాన రహదారి మార్గంలో ఏర్పాటు చేసిన అమరావతి చిత్రకళావీధిలో రేజేటి ప్రదర్శించిన చిత్రాలను చూసి ప్రశంసించారు. కనుమరుగవుతున్న పల్లె, పల్లె ప్రజల స్థితిగతులను వారి జీవన విధానాన్ని పల్లె పూర్వవైభవాన్ని కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించడంపై వారు అభినందించారు.



మంత్రి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కరుణాకర్

పైప్‌లైన్ లీకు అరికట్టండి

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం కోమటి చెరువు వద్ద తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ వాల్వ్ లీకై తాగునీరు వృథాగా పోతోంది. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. లీకును సరిచేసి తాగునీరు వృథా కాకుండా చూడాలని పలువురు కోరారు.



తాగునీరు వృథా అవుతున్న దృశ్యం

భగవద్గీతను పఠించాలి

శృంగవరపుకోట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి భారతీయుడు భగవద్గీత పఠించాలని మోక్ష విద్యామందిర్ వ్యవస్థాపకుడు శీలా కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం శృంగవరపుకోట శ్రీనివాస కాలనీ కుసమ హరినాథఆలయం సమీపంలో ప్రతి ఇంటికి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. దారరాజు, శ్రీహరి, గౌతమి తదితరులున్నారు.

మిమ్స్‌లో ఘనంగా నవమి వేడుకలు

నెలిమర్ల, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిమ్స్‌లో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కేంద్ర మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు పాల్గొన్నారు. స్వామికి పూజలు నిర్వహించారు.



నవమి ఉత్సవాలకు హాజరైన అశోక్

గౌరినాయుడుకు సత్కారం

లక్కవరపుకోట, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిత్తన్నపేట గ్రామానికి చెందిన సాహితీవేత్త కిలారి గౌరినాయుడును తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి ఆదివారం రాజమండ్రిలో ఘనంగా సత్కరించింది. ప్రముఖ కవి బోయి భీమన్న జీవితం-సాహిత్యం అంశంపై ప్రత్యేక ప్రసంగం చేశారు. బోయి భీమన్న రచించిన పాలేరు నాటకం యువతను చదువుకునేలా చేసి ఉన్నత శిఖరాలకు చేర్చిందని గుర్తుచేశారు. అనంతరం ఎమ్మెల్సీ నాగబాబును కలిసి గెస్టు లెక్చరర్ల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో రచయితలు, సాహితీవేత్తలు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న పీజీఆర్ఎస్‌లో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొననున్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారని మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన విడుదల అయింది.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

చీపురుపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజాం, చీపురుపల్లి, గరివిడి, గుర్ల, లక్కవరపుకోట, ఎస్.కోటల్లోని పార్టీ కార్యాలయాల్లో మండల నాయకులు కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. చీపురుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ వర్మ పాల్గొన్నారు.



చీపురుపల్లిలో బైక్ ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు

యువకుడి ఆత్మహత్య

భోగాపురం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కంచేరు సమీపంలో ఎయిర్‌పోర్టు క్వార్టర్స్‌లో బీహార్‌కు చెందిన రాజ్‌కుమార్(25) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ వి.పాపారావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల మేరకు బీహార్‌కు చెందిన రాజ్‌కుమార్ నెలరోజుల క్రితమే ఇక్కడ పని కోసం వచ్చాడు. అయితే నిరంతరం ఫోన్‌లో మాట్లాడుతుండేవాడు. ఆదివారం ఉదయం పనికి వెళ్లకుండా ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అయితే మధ్యాహ్నం రూమ్ మేట్స్ వచ్చేసరికి చూసే తలుపులు మూసి ఉన్నాయి. కిటికిలో నుంచి చూసేసరికి ఇనుప రాడ్డుకు రాజ్‌కుమార్ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో ఫిర్యాదు చేశారన్నారు. అబ్దుస్‌సలామ్ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేశాయని ఎస్ఐ తెలిపారు.

బతుకు తెరువుకు వెళ్లి..

● విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజేష్ (ఫైల్)

జియ్యమ్మవలస, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బతుకుతెరువుకు ఊరు విడిచి వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం కుందరతిరువాడ పంచాయతీ నీచుకవలస గ్రామానికి చెందిన పత్తిక రాజేష్(22) అనే యువకుడు బతుకు తెరువు కోసం విశాఖపట్నం వెళ్లాడు. ఇళ్లకు పెయింటింగ్ వేసే పనిలో చేరాడు. ఈక్రమంలో గత నెల 28న గాజువాకలోని ఓ ఇంటికి పెయింటింగ్ వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు వెంటనే ఆ యువకుడిని కేజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. ఈ ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి తరలించారు. మృతిచెందిన రాజేష్‌కు తండ్రి పత్తిక శ్రీనివాసరావు, తల్లి సునీత, తమ్ముడు రాకేష్ ఉన్నారు.

ఆటో బోల్తా: మహిళ మృతి

● తొమ్మిది మందికి గాయాలు

సీతంపేట రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలం సోమగండి పంచాయతీ పరిధి అక్కన్నగూడ సమీపంలో ఆదివారం ఎ యంత్రం ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో రాజన్నగూడకు చెందిన సవర పెద్ద తిక్కమ్మ(54) మృతి చెందింది. మరో తొమ్మిది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపిన వివరాల ప్రకారం.. సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో ఏర్పాటు చేసిన ఓ ఫంక్షన్‌లో పాల్గొనేందుకు పది మంది కుటుంబ సభ్యులు రాజన్న గూడ నుంచి ఆటోలో బయల్దేరారు. రెండు కిలోమీటర్లు దాటిన తర్వాత అక్కన్నగూడ సమీపంలో అదుపు తప్పి వాహనం బోల్తా పడింది. దీంతో అక్కడికక్కడే తిక్కమ్మ మృతి చెందింది. కుటుంబ సభ్యులైన సవర ఉషారాణి, స్మిత్, రాశి, సునేమి, రాయమణి, సౌజన్య, సునీత, మీనా, సోహైల్, జీవన్‌లు గాయాలపాలయ్యారు. స్థానికులు వీరిని 108 వాహనంలో సీతంపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. క్షతగాత్రుల్లో ముగ్గురిని మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ స్వాధీనం

భోగాపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలం చెరకుపల్లి సమీపంలో గ్రావెల్ తవ్వకాలు చేస్తున్న ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్టు వీఆర్వో సంతోష్ తెలిపారు. పోలిపల్లి రెవెన్యూ సమీపంలో కొండ పోరంబోకు సర్వే నెంబరు 183లో గ్రావెల్ అక్రమ తవ్వకాలపై అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. గ్రావెల్ అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు గుర్తించి సంబంధిత వాహనాలను పోలీసులకు అప్పగించామన్నారు. ఈ విషయమై తహసీల్దారు ఎం.సురేష్‌ను వివరణ కోరగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

• జిల్లా అంతటా రామ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
• వైభవంగా సీతారాముల కల్యాణం
• పూజల్లో పాల్గొన్న భక్తజనం

వైభవంగా రామనవమి

శ్రీరామనవమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. రామాలయాలన్నీ రామ నామస్మరణతో మారుమోగాయి. సీతారాముల కల్యాణోత్సవాన్ని భక్తజనం తిలకించి.. పులకించింది. సాలూరులోని డబ్బివీధి, పెదకోమటిపేట గ్రామాల్లో నిర్వహించిన కల్యాణోత్సవాల్లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. పార్వతీపురంలో సీతారాముల కల్యాణానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పట్టు వస్త్రాలు సమర్పించారు. గుమ్మలక్ష్మీపురం మండలం గుణదలో నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి దంపతులు పాల్గొన్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)


సాలూరు రూరల్: పెదకోమటిపేటలో పూజల్లో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి


గుమ్మలక్ష్మీపురం: గుణదలో కల్యాణోత్సవంలో ప్రభుత్వ విప్ జగదీశ్వరి


పార్వతీపురంటౌన్: పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయచంద్ర


బెలగాం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరువీధి


పార్వతీపురంలో సీతారాముల కల్యాణం


కురుపాం: కోటలో పూజలు నిర్వహిస్తున్న కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల


సీతంపేట రూరల్: పులిపుట్టిలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి


మక్కువ: కాశీపట్నంలో..


పాలకొండ: నాగవంశపువీధిలో సారె సమర్పించిన దృశ్యం

ఆటంకాలు తొలగేనా?

(5వ పేజీ తరువాయి)

భూములిచ్చిన రైతులు, మరోవైపు క్రీడాకారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఆర్‌ఆర్‌బీ పురంలో క్రీడా ప్రాంగణం నిర్మాణం కాగితాలకే పరిమితమైంది.

● 2016- 2017లో గుమ్మలక్ష్మీపురం మండలంలో సుమారు రూ. రెండు కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం 16/2, 16/3 ఏ, 17/2 తదితర సర్వే నెంబర్లలో పది ఎకరాల ఐదు సెంట్లను కేటాయించారు. 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్ ఫీల్డ్ నిర్మాణంతో పాటు ఇతరత్రా పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఇందుకోసం అప్పట్లో ఐటీడీఏ నిధులు మంజూరు చేశారు. నిర్మాణ బాధ్యతను ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పటించారు. అయితే సుమారు 30 శాతం నిర్మాణం పూర్తయిన తర్వాత వివిధ కారణాలతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికీ ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తవకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

● సాలూరు పట్టణంలోని వీఆర్‌ఎస్ కాలనీలోని ఇండోర్ స్టేడియం పూర్తిగా పాడైంది. కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. వాస్తవంగా ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించారు. అయితే ప్రస్తుతం స్టేడియం శిక్షణలకు అనువుగా లేదు. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో క్రీడాకారులు అటువైపు వెళ్లేందుకు సాహించడం లేదు.

క్రీడా కాంప్లెక్స్ నిర్మాణానికి అడుగులు

రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఒక క్రీడా కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. ముందుగా జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని గత ఏడాది జిల్లా పర్యటనకు వచ్చిన క్రీడా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించారు. పార్వతీపురం ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. సీతానగరం మండలం జోగింపేట వద్ద సర్వే నెంబర్ 10/2ఏలో పది ఎకరాలను కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా క్రీడా కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నాయి. దీనికి సంబంధించి డిటేయిల్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాల్సి ఉంది. కాగా త్వరితగతిన పనులు చేపట్టి క్రీడా కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తేవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

పరిశ్రమలు ఏర్పాటయ్యేనా?

● నేడు తొలిసారిగా జిల్లాకు మంత్రి కొండపల్లి రాక

పార్వతీపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధారిత జిల్లా అయిన పార్వతీపురం మన్యం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. హడావుడిగా జిల్లా ఏర్పాటు చేసినా పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదు. పారిశ్రామికవాడకు ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తామని అప్పటి పాలకులు చెప్పినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. దీంతో మన్యం వాసులు ఎంతోమంది పొట్ట చేతపట్టుకుని వలస బాట పడుతున్నారు. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల్లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ తరుణంలో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సోమవారం జిల్లాకు వస్తుండడంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కలెక్టరేట్‌లో వివిధ శాఖలతో ఆయన సమీక్షించనున్నారు. ముఖ్యంగా పారిశ్రామికంగా అభివృద్ధిపై చర్చించనున్నారు. మన్యంలో పరిశ్రమల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

రెల్లి, ఉపకులాలకు న్యాయం చేయండి


నిరసన వ్యక్తం చేస్తున్న రెల్లి, ఉపకులాల సభ్యులు

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రెల్లి, ఉపకులాలకు న్యాయం చేయాలని జిల్లా రెల్లి కులాల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఇందిరా కాలనీ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర రెల్లి జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తమ కులాలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్పా విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించడం లేదన్నారు. దళితుల్లో తమకు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని చెప్పారు.

మెగా క్రికెట్ టోర్నమెంట్ విజేత పోలీసు టీం


పోలీసు టీంకు ట్రోఫీ అందజేస్తున్న మాజీ ఎంపీ ప్రదీప్‌దేవ్

కురుపాం రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సింగుపురం గ్రామంలో జాకారమ్మ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గత 20 రోజులుగా మెగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 70 టీంలు పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన తుది పోరులో బెల్లిడి టీంపై పోలీసు టీం విజేతగా నిలిచింది. విన్నర్ టీంకు రూ.20వేలు నగదు, ట్రోఫీ, రన్నర్ టీంకు రూ.10వేల నగదు, ట్రోఫీని మాజీ ఎంపీ ప్రదీప్‌కుమార్ దేవ్ అందజేశారు. పోలీసు టీంకు ఎల్విన్‌పేట సీఐ బి.హరి కెప్టెన్‌గా వ్యవహరించారు.

సాలూరు ఏఎంసీ కార్యవర్గం ఏర్పాటు

సాలూరు, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సాలూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యవర్గాన్ని ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. ఇప్పటికే వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా ముఖీ సూర్యనారాయణను ప్రకటించిన విషయం తెలిసిందే. వైస్ చైర్మన్‌గా మక్కువ మండలం దబ్బగెడ్డకు చెందిన మింది సింహాచలంను ఎంపిక చేశారు. సభ్యులుగా సోముల మచ్చ కళావతి, సొండి దేవి, దునారు ఆనంద్, రౌతు రామారావు, డొంక అన్నపూర్ణ, అక్కేన రాధ, పుసర్ల నర్సింగరావు, గొంగాడ సరస్వతి, బేటుకూరి రామన్నదొర, కురుమూరు శివకృష్ణ, జగ్గ వెంకటరాజు, అల్లు అప్పయ్యమ్మ, సింకిలి పుష్పలను సభ్యులుగా నామినేట్ చేశారు. దీంతో నామినేటెట్‌గా ఎన్నికైన సభ్యులకు, వైస్ చైర్మన్‌కు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అభినందనలు తెలిపారు. సాలూరు మార్కెటింగ్ కమిటీ ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెటింగ్ రంగంలో పారదర్శకత, సమర్థత పెంపొందించటంలో ఈ నూతన కమిటీ కీలకంగా పని చేస్తుందని అన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

విశ్వబ్రాహ్మణ సంఘం సేవలు భేష్

సాలూరు నియోజక వర్గంలో విశ్వబ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు భేష్ అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సాలూరులో కొంకివీధి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన విశ్వబ్రాహ్మణ సంఘం ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆమె హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘం నిర్వహిస్తున్న కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి సౌకర్యం

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ


ఇంటింటి కుళాయిలకు శంకుస్థాపన చేస్తున్న పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి సౌకర్యం కల్పిస్తామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలోని కొత్తగూడ, దుగ్గి గ్రామాల్లో పీఎంజన్‌మన్ పథకం కింద రూ.18లక్షలతో మంజూరైన గ్రౌండ్ లెవెల్ వాటర్ ట్యాంక్, ఇంటింటికి మంజూరైన నీటి కుళాయి పథకానికి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని అన్నారు. మారుమూల గ్రామాలకు సీసీ రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజనాభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.

జనసేనలో చేరిక

సీతంపేట మండలంలోని దుగ్గి పంచాయతీ పరిధిలో గల పలు గిరిజన గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరాయి. వీరంతా ఆదివారం పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో సీతంపేట మండలంలో వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ ఏఎంసీ చైర్మన్ బి.సంధ్యారాణి, జీసీసీ చైర్మన్ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదనరావు, ఏఈ సత్యం, జనసేన మండల అధ్యక్షుడు విశ్వనాథం, పవన్, కూటమి నాయకులు హెచ్.ప్రసాద్, ఎం.ప్రకాశం, అజయ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాను ఎక్కిన ఏనుగు


వ్యానులో బొమ్మ ఏనుగును తరలిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలోని ప్రధాన రహదారిలో ఓ ఏనుగును వ్యానులో తరలించడం చూసి అందరూ ఆశ్చర్యపోయారు. తీరా దగ్గరికి వెళ్లి చూడగా అది నిజమైన ఏనుగు కాదని గ్రహించారు. బొమ్మ ఏనుగు అని తెలుసుకుని అవాక్కయ్యారు. ఓ ప్రైవేటు ఈవెంట్ నడుపుతున్న సంస్థ విజయనగరం నుంచి పాలకొండకు ఇలా ఈ బొమ్మ ఏనుగును తీసుకువెళ్తోంది.

పాఠశాలల బలోపేతానికి కృషి

బొబ్బిలి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని యూటీ ఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు.ఆదివారం బొబ్బిలిలో యూటీఎఫ్ డివిజన్ స్థాయి సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభు త్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ మేరకు సంబంధించిన కరపత్రాలను విడుదలచేశారు. కార్యక్రమం లో యూటీఎఫ్ నాయకులు కె.విజయగౌరి, ప్ర సన్నకుమార్, కేశవరావు, కస్తూరి , శ్రీనివాస్, శంకరరావు, రామారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఆర్థిక విధ్వంసం

● చీపురుపల్లి ఎమ్మెల్యే కళా

పాలకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. ఆయన ఆదివారం పాలకొండ విచ్చేశారు. ఈసందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జగన్ కాలంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని పూడ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. వచ్చే ఏడాది ఖరీఫ్ నాటికి విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో తోటపల్లి ప్రాజెక్టు ద్వారా పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టుకు సుమారు రూ.36కోట్లు నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులను సద్వినియోగం చేసుకుని పూర్తిస్థాయిలో తాగునీటిని అందిస్తామన్నారు. ఆయనతో పాటు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ నాయకులు సుంకరి అనీల్‌దత్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, శిల్లా గుప్త, రాంబాబు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న కళా వెంకటరావు

టీడీపీ నాయకుడికి పరామర్శ

స్థానిక టీడీపీ నాయకుడు పల్లా కొండలరావును చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు ఆదివారం పరామర్శించారు. కొండలరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే

మక్కువ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీ సమీపంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి పక్కన చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్గంధ భరిత వాతావరణం నెలకొంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది. బీసీ కాలనీవాసులు వ్యర్థాలను రహదారి పక్కన వేయడంతో పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.


రహదారి పక్కనే పేరుకుపోయిన వ్యర్థాలు

న్యూస్ బాక్స్

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు దివాకర్, అప్పలస్వామి, దొరబాబు, భాస్కరరావు, సురేంద్ర, కూటమి సభ్యులు మన్మథరావు, అనీల్, ఆచారీ తదితరుల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు.

● వీరఘట్టం: వీరఘట్టంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీరఘట్టం ప్రధాన రహదారిలో జెండా ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ చేశారు. బీజేపీ నాయకులు గుణుపూర్ వెంకటనాయుడు, పార్టీ మండల అధ్యక్షురాలు బి.సీతామహాలక్ష్మి, సుధాకర్, కోటేశ్వరరావు, సింహాచలం, చైతన్య పాల్గొన్నారు.

తీరిన తాగునీటి కష్టాలు


దుర్గపేటలో కుళాయిల నుంచి నీరు వస్తున్న దృశ్యం

వీరఘట్టం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పంచాయతీ కార్యాలయం దగ్గరలో ఉన్న దుర్గపేటవాసులకు తాగునీటి కష్టలు తీరాయి. ఇటీవల ఆ కాలనీ మహిళలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూనదరావు స్పందించి, దుర్గపేట వీధిని పరిశీలించారు. తక్షణమే ఆ ప్రాంతంలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీ ఈవో కోటేశ్వరరావు ఆదివారం ఆ ప్రాంతాన్ని సందర్శించి, కుళాయిలకు మరమ్మతులు చేపట్టి, తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు


కల్వర్టుపై పలకలు ఊడిన దృశ్యం

వీరఘట్టం, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): వీరఘట్టం పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా తయారయ్యింది. కాలువపై ఉన్న పలకలు ఊడిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ ఈవో కోటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. కల్వర్టును మరమ్మతులు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

రెచ్చిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు

● రోజుల వ్యవధిలోని ఏడుచోట్ల చోరీలు
● వాటి విలువ రూ.18 లక్షలు

కొత్తవలస, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి):మండలంలో విద్యు త్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు రెచ్చిపోతున్నారు. వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా శనివారం రాత్రి దేశపాత్రునిపాలెం సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను చోరీ చేశారు. మండలంలో గత కొద్ది రోజుల వ్యవధిలోనే 7 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు రూ.18 లక్షల వరకు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. చినరావుపల్లి, కంటకాపల్లి, పెదరావుపల్లి, కాటకాపల్లి, అప్పన్నదొరపాలెం, దేశపాత్రునిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురైనట్టు ఆ గ్రామాల సర్పంచ్‌లు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామాలకు సంబంధించి రోడ్డుపక్కన ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల లక్ష్యంగా చోరీ చేస్తున్నట్టు విద్యుత్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. దొంగలు సులభంగా విద్యుత్ కనెక్షన్ తప్పించి, ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైరును వేరు చేసి పట్టుకెళ్లిపోతున్నారని చెబుతున్నారు. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ.2.50లక్షలు ఉంటుందని అంటున్నారు. కొత్తవలస మండలంలోనే కాకుండా జామి, వేపాడ, లక్కవరపుకోట మండలాల్లో కూడా ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ జరిగినట్టు తమకు సమాచారం వచ్చిందని కొత్తవలస విద్యుత్ శాఖ ఏఈ అప్పారావు తెలిపారు. ప్రస్తుతం సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా తక్కువగా ఉందని, చోరీకి గురైన వాటి స్థానంలో కొత్తవి వేయడం ఇబ్బందిగా మారుతుందని అంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ షణ్ముఖరావు తెలిపారు.

ఘనంగా శ్రీరామ నవమి

ఒడిశా

రాయగడ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రాయగడలో శ్రీరామ నవమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భజరంగదళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యు లు స్వామివారిని రథంపై ఊరేగించా రు. స్థానిక ప్రధాన బజారులో ఉన్న మసీదు సమీపంలో ముస్లింలు రామ నవమిని పురస్కరించుకుని పానకం వితరణ చేయడం విశేషం.


రామ రథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు